# నేను పక్కా లోకల్

- మంత్రి హరీష్‌రావు లోకలే
- సిఎం కేసీఆర్ కూడా లోకలే
- నేను మాట తప్ప, మీరూ మాట తప్పొద్దు
- 6 నెలలు తిరగక ముందే మూడు హామీలు పూర్తి చేస్తా
- అనాజీపూర్ గ్రామ సభలో ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి హామీల వర్షం



**నేను పక్కా లోకల్, మంత్రి హరీష్ రావు లోకలే, సీఎం కేసీఆర్ లోకలే.. నియోజకవర్గ పరంగా, జిల్లా పరంగా, రాష్ట్ర పరంగా మూడు దశల్లో అధికారంలో ఉండి ప్రజా సమస్యలు లెక్కలతో సహా పక్కగా తెలిసి అన్నింటిని పరిష్కరిస్తూ ప్రజల దీవెనార్తి తో ప్రజా రంజక పాలన అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ(కారు గుర్తు) కావాలో సెంటర్( కేంద్రం) నుండి వచ్చి బాయి, బహనో అంటూ చిలక పలుకులు పలికే కాంగ్రెస్, బీజేపీ కావాలో తేల్చుకోవాలని మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని రాయపోల్ మండలం అనాజ్ పూర్ గ్రామంలో పాదయాత్ర చేపట్టి ఆ గ్రామ చౌరస్తాలో స్థానికులతో మాట్లాడారు. ఆయన స్థానికులతో ఇంకా ఏమన్నారంటే..**

**ఉమ్మడి మెదక్ బ్యూరో, అక్టోబర్ 28 (ప్రభ న్యూస్):** నేనొక ఎంపీగా ఉన్నా, మంత్రి హరీషర ావుతో నియోజకవర్గ అభివృద్ధి పై నిత్యం సమీక్షిస్తూనే ఉంటా.. నేను పక్కా లోకల్.. చిన్నప్పటి నుంచి ఇక్కడే పెరిగా, ఇక్కడి సమస్యలపై పక్కాగా అవగాహన ఉన్నోన్ని.. నేను లోకల్( నియోజకవర్గ అభ్యర్థి), మంత్రి హరీష్‌రావు లోకల్( జిల్లా మంత్రి) సీఎం కేసీఆర్ లోకల్( సీఎం సొంత జిల్లా) అంటూ ఇక్కడి ప్రజల సమస్యల నుండి మనో భావాల వరకు అడుగడుగునా తెలిసినోన్ని ఏమి కావాలో, ఏమి చేయాలో పక్కగా లెక్కలతో సహ అవగాహన ఉన్నోన్నీ కాబట్టి నేను మాట తప్ప( మీ సమస్యలన్నింటిని తీర్చే పూజి నాది) మీరు మాట తప్పొద్దు(నన్ను గెలిపోయించుకునే బాధ్యత మీది) అంటూ దుబ్బాక నియోజకవర్గ పరిధి రాయిపోల్ మండలం అనాజీ పూర్ గ్రామంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి ప్రసంగించారు. తాను గెలిచిన వెంటనే ఇప్పటికే హామీ ఇచ్చిన గ్రామ ప్రధాన సమస్యలైన వాటర్ ట్యాంక్, పోచమ్మదేవాలయం, చౌదరి పాలెం రోడ్డును 6 నెలల్లో పూర్తి చేయిస్తా అంటూ హామీ ఇచ్చారు. ఇంకా ముదిరాజ్ లు మల్లన్న సాగర్ లో చేపలు ఉత్పత్తి చేసేందుకు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తా అని హామీనిచ్చారు. అనాజీపూర్ చెరువును పూర్తిగా అభివృద్ధి చేసి చెరువును నిండు కుండలా తీర్చిదిద్దుతానని ప్రభాకర్ రెడ్డి హామీనిచ్చారు.

**గ్యాస్ 400 వస్తది.. కల్యాణ లక్ష్మీ 2 లక్షలు ఇస్తమ్.. గృహ లక్ష్మికి 3 లక్షలు ఇస్తమ్**

బీఆర్ ఎస్ ప్రభుత్వం పేదల పక్షపాతి.. అందుకే స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలుకాని పథకాలను రాష్ట్రంలో సి ఎం కేసీఆర్ ప్రవేశ పెట్టి అమలుచేశామని ప్రభాకర్ రెడ్డి అన్నారు.
ఇంకా కొత్తగా ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలో గ్యాస్ 400 రూపాయలకే ఇస్తామని, కళ్యాణలక్ష్మి, షాధి ముబారక్ లను 2 లక్షలకు పెంచుతామని, గృహ లక్ష్మీ పథకం ద్వారా ఇంటి జాగ ఉన్న పేదోళ్లకు 3 లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించాడన్నారు.

**లోకల్ కావాలా.. బాయి.. బహనో అంటూ వచ్చేటోళ్లు కావాలా..**

రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఏమి కావాలో, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకెల్లాలో సి ఎం కేసీఆర్ కు స్పష్టమైన అవగాహన ఉందని ఈ జిల్లా వాసిగా సి ఎం సర్ లోకల్, మంత్రి హరీష్ రావు కూడా లోకలే, నేను లోకలే కానీ ఢిల్లీ నుండి వచ్చేటోళ్లు నాన్ లోకల్, వాళ్ళు వస్తే ఆ పార్టీ లోకల్ లీడర్లు ట్రాన్సలేట్ చేయాల్సిన గత్యంతరం.. వారు ఏమి చెబుతున్నారో ఎవ్వరికీ ఏమి తెలియదు.. బాయి.. బహనో అంటూ హిందీలో మాట్లాడుతరు.. ఇక్కడోళ్లు సమజయ్.. సమజ్ గాక ఏదోదో చెప్పి పోతరు.. ఇక ఏదైన పని కావాలంటే ఢిల్లీ నుండి సిగ్నల్ రావాల్సిందే.. అదే బీఆర్ ఎస్ పార్టీకి ఓటేసి గెలిపిత్తే అందరం లోకల్ గిట్లనే మీ పనులు ఒడుస్తయ్.. అంటూ ప్రభాకర్ రెడ్డి అనాజ్ పూర్ వాసులకు హామీలిచ్చారు..

**బోనాలతో స్వాగతం.. పూలవర్షం కురిపింత**

అనాజీపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించిన కొత్త ప్రభాకర్ రెడ్డికి అడుగడుగునా జననీరాజనాలు పలికారు. ముఖ్యంగా పోచమ్మ దేవాలయం నుండి అనాజీపూర్ గ్రామ చౌరస్తా వరకు బతుకమ్మలతో స్వాగతం పలికారు. చౌరస్తాకు చేరుకునే క్రమంలో భారీగా ప్రభాకర్ రెడ్డి పై పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మొత్తానికి అనాజీపూర్ గ్రామంలో నిర్వహించిన పాదయాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యింది.







# దేశానికే మోడల్!

## కరువు లేదు.. కర్ఫ్యూ లేదు

- అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత సాధించాం
- పల్లులు, పట్టణాల్లో గణనీయమైన ప్రగతి
- ఐటీ ఎగుమతుల 400శాతం పెరిగాయి
- సాగునీటి రంగంలో విప్లవాత్మకమైన మార్పులు
- మిషన్ భగీరథతో తాగునీటి ఇబ్బందులు దూరం
- 58 ఏండ్లు అధికారం ఇస్తే కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి
- కేంద్రంలో అధికారం ఉన్నా, బీజేపీ ఇచ్చింది శూన్యం
- మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో ఈ తొమ్మిదిన్నరేళ్లలో కరువు లేదు.. కర్ఫ్యూ లేదన్నారు మంత్రి కేటీఆర్. శనివారం ఉదయం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో పలు అంశాలపై మాట్లాడారు. దేశానికే తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత సాధించామన్నారు. పల్లెలు, పట్టణాల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. ఐటీ ఎగుమతులు 400 శాతం పెరిగాయన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ అణగదొక్కిందన్నారు. కాంగ్రెస్ చేసిన పాపానికి తెలంగాణ 58 ఏళ్లు గోసపడిందన్నారు. 11సార్లు ఈ రాష్ట్రాన్ని పాలించిన పార్టీ ఏం చేసిందో ఆలోచించాలన్నారు. కనీసం కరెంట్, నీళ్లు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. నాడు మైగ్రేషన్‌కు కేరాఫ్ పాలమూరు.. ఇవాళ ఇరిగేషన్‌కి కేరాఫ్‌గా మారిందన్నారు. అందుకే దేశంలోని ఏ రాష్ట్రం సాధించని ప్రగతి సాధించామన్నారు. ఏ రంగాన్ని తీసుకున్న తెలంగాణ కంటే మెరుగైన ప్రగతి సాధించిన రాష్ట్రం ఉందా ఆలోచించాలన్నారు. అభివృద్ధిలో అగ్రగామి తెలంగాణ అన్నారు. వృద్ధిరేటలో ఐదో స్థానంలో ఉన్నామన్నారు. సాగునీటి రంగంలో విప్లవాత్మకమైన మార్పులు, మిషన్ భగీరథతో తాగునీటి సమస్యను అధిగమించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ 1గా ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ తెలంగాణకు ఇచ్చింది శూన్యం అన్నారు. ఓట్లు అడిగే ముందు తెలంగాణకు ఏం చేశామో చెప్పి రావాలని బీజేపీ నేతలను డిమాండ్ చేశారు. ఐటీలో హైదరాబాద్ బెంగళూరును దాటిపోయిందన్నారు.

**పేద రికంలో దేశం నైజీరియాను దాటింది..**

పేదరికంలో భారతదేశం నైజీరియాను దాటిందని మంత్రి క్వలకుంట్ల తారాకరామరావు పేర్కొన్నారు. దేశానికి దిక్సూచిగా తెలంగాణ మారిందని, దేశ తలసరి ఆదాయంలో నెంబర్‌గా ఉందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేదని తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుందన్నారు. 9ఏళ్ల క్రితంతో పోలీస్తే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. 9 ఏళ్లలో కరువులేదు, కర్ఫ్యూ లేదని, సంపద పెంచడమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ద్వితీయ శ్రేణి పౌరులు లేరన్నారు. కర్నాటకలో 5గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని, కర్నాటక రైతులు, గద్వాల్, కొడంగల్ వచ్చి ధర్నాలు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఐటీలో 400శాతం అభివృద్ధి సాధించామని, ఐటీలో హైదరాబాద్ బెంగుళూరును మించిపోయిందన్నారు. దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ మారిందని, తెలంగాణ సమ్మిళిత, సమగ్ర, సమికృత మోడల్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసిన పాపానికి తెలంగాణ 58ఏళ్లు బాధపడ్డామని, ఇప్పుడు కాంగ్రెస్ 6గ్యారెంటీలతో మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు.

# సూర్యాపేట మహాప్రస్థానం చాలా బాగుంది

- అర్ధరాత్రి సందర్శించిన తనికెళ్ల భరణి
- సాహిత్య సభకు హాజరు
- శివుడి విగ్రహాన్ని చూసి పరవశం
- శ్మశాన వాటిక కలియ తిరుగుతూ పరిశీలన



**ప్రభన్యూస్, సూర్యాపేట ప్రతినిధి:** సమయం అర్ధరాత్రి 1:30 గంటలు. పట్టణప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్న వేళ మహాప్రస్థానంలో కొలువైన పరమశివుడి చెంత చిత్తంలో మునిగిపోయారు సినీ నటుడు, కవి, రచయిత తనికెళ్ల భరణి. సూర్యాపేటలో శుక్రవారం రాత్రి జరిగిన ఓ సాహిత్యసభకు హాజరైన భరణి, అక్కడ కవుల ప్రసంగంలో మహాప్రస్థానం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయారు. వెంటనే సందర్శించాలని నిర్ణయించుకున్న ఆయన తన మనసులోని కోరికను సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి జగదీష్‌రెడ్డికి తెలిపారు. సభ అనంతరం అర్ధరాత్రి 1:30గంటలకు తనికెళ్ల భరణిని స్వయంగా మంత్రి జగదీష్‌రెడ్డి మహాప్రస్థానం వద్దకు తీసుకెళ్లారు. వాహనం దిగుతూనే ప్రస్థానంలో కొలువై ఉన్న పరమశివుడి విగ్రహాన్ని చూసి పరవశించిపోయారు భరణి. దాదాపు గంట సేపు శివ చిత్తం లో మునిగితేలారు. స్మశాన వాటిక నలుమూలలా కలియ తిరుగుతూ మహా అద్భుతం అంటూ జాషువా పద్యాన్ని నెమరవేసుకున్నారు.

**ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని**
**కలము, నిప్పులలోనఁ గఱఁగిపోయె**
**ఇచ్చోటనే భూములేలు రాజన్యుని**
**యధికార ముద్రిక లంతరించె**
**ఇచ్చోటనే లేఁత ఇల్లాలి నల్లపూస**
**ల సౌరు గంగలోఁ గలసిపోయె!**

అంటూ ఇంతటి అద్భుత మహాప్రస్థానాన్ని 20 ఏళ్ల క్రితం యూరప్‌లో చూశాను అన్న తనికెళ్ళ, అక్కడ సైతం స్మశానం ఇరుకుగా ఉందన్నారు. ఆ తర్వాత మళ్లీd సూర్యాపేటలోనే అంతటి నిర్మాణాన్ని చూస్తున్నానని తెలిపారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సువిశాలంగా, అహ్లాదకరంగా రూపుదిద్దుకున్న మహాప్రస్థాన దర్శనభాగ్యం కల్పించిన మంత్రి జగదీష్ రెడ్డీ...ధన్యోస్మి అంటూ ఆనందభాష్పాలతో వెనుదిరిగారు.

# ఇంద్రకీలాద్రి వైభవంగా గిరి ప్రదక్షణ

## పౌర్ణమి రోజు ప్రదక్షణకు తరలివచ్చిన భక్తజనం

**ఎన్టీఆర్ ప్రభ న్యూస్ బ్యూరో :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణ అత్యంత వైభవపేతంగా జరిగింది. శనివారం పౌర్ణమి సందర్భముగా ఉదయం లోకకళ్యాణార్థం, భక్త జనశ్రేయస్సు కోసం ధర్మప్రచారం నిమిత్తం వేదపండితుల మంత్రోచ్చరణలు, అమ్మవారి నామ స్మరణలు, మంగళ వాయిద్యముల నడుమ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం(ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లుకు ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తముగా పూజలు నిర్విహించి, కొబ్బరి కాయ కొట్టి గిరిప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు బచ్చు మాధవీ కృష్ణ , కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి, సహాయ కార్యనిర్వాహనాధికారి పి చంద్ర శేఖర్, ఆలయ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమము శ్రీ కామధేను అమ్మవారి ఆలయము, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, సితార, కబేలా, పాల ఫ్యాక్టరీ, చిట్టి నగర్, కొత్తపేట, నెహ్రు బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు, బేతాల నృత్యములు తదితర సాంస్కృతిక కార్యక్రమముల నడుమ తిరిగి ఆలయమునకు చేరుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గము లో భక్తులు ప్రచార రథము లో కొలువై ఉన్న శ్రీ అమ్మవారు, స్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూలు, పండ్లు, కొబ్బరికాయ లు సమర్పించి, పూజలు చేసి, అమ్మవారిని, స్వామి వారిని ప్రార్థించి, అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. అమ్మవారి శిఖరం చుట్టూ పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ చేస్తే భక్తుల కోరికలు త్వరగా తీరుతాయని ప్రతీతి.



**మల్లన్నా.. మజాకా!**



**మంత్రి మల్లారెడ్డి తీరు మరోసారి వార్తల్లో నిలిచేలా చేసింది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 17, 18వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మల్లారెడ్డి వారికి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఉత్సాహంలో గౌరమ్మ అనే వృద్ధురాలిని మంత్రి మల్లారెడ్డి చంటి పిల్లలా తన ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. ఆ ఫోటో వైరల్ కావడంతో మల్లన్నస్టైలే వేరు అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.**